ముంచుకొస్తున్న పాలకమండలి గడువు

-జిహెచ్ఎంసి అధికారులపై మరింత బాధ్యత
-అభివృద్ధి పనులపై జెడ్సి, డిసిలు ప్రత్యేక దృష్టిపెట్టాలి
-పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రిపొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ కర్ణన్ తదితరులు

హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త: శివారు ప్రాంతాల్లోని 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కలుపుకుని జిహెచ్ఎంసి మరింత విస్తరించి 300వార్డులుగా విభజించిన సంగతి తెలిసిందే..ఈనేపథ్యంలో మరికొద్దిరోజుల్లో (ఫిబ్రవరి 10)తో పాలకవర్గ కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలోబుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్, కమిషనర్,అదనపు కమిషనర్‌లు జెడ్సి,డిసి ఇతర విభాగాల ఉన్నతాధికారులతో కలిసి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వాటి పురోగతి పై సమీక్షించారు.ఈసందర్భంగా హెచ్ సిటీ, ఎస్ఆర్‌డీపీ ,ఎస్ఎన్‌డిపి, రోడ్లు,స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, సానిటేషన్, ప్రజారోగ్యం, ఐటీ, టౌన్ ప్లానింగ్, మహిళా సంక్షేమం, పట్టణ స్వయం సహాయక సంఘాలకు చేయూత, పర్యావరణం , గాలి నాణ్యత వంటి అంశాలను వాటి పురోగతి, క్షేత్ర సమస్యలు, ప్రభుత్వ సహకారం ను పేర్కొంటూ సంబంధిత అధికారులు మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలక వర్గం పదవి కాలం మరో 20 రోజుల్లో ముగియనుండడంతో జీహెచ్ఎంసీ అధికారులపై మరింత బాధ్యత పెరగనుందన్నారు. నిత్యం అప్రమత్తంగా ఉంటూ పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డిప్యూటీ కమిషనర్‌లు తమ పరిధిలోని పనులను త్వరితగిన పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రేటర్ లో 72, 942 పైగా ఉన్న స్వయం సహాయక సంఘాలను లక్ష సంఘాల వరకు పెంచాలన్నారు. బిపిఎల్ కుటుంబానికీ చెందిన ప్రతి మహిళా సంఘంలో సభ్యులుగా చేర్చాలన్నారు.అలాగే హెచ్‌సిటీ , ఎస్ఆర్‌డీపీ, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు పకడ్బంది కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు.అంతేకాకుండా హైదరాబాద్ లో కాలుష్య నివారణ పై ,భూగర్భ జలాలను కాపాడేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ 5 ఏండ్ల తమ పాలకవర్గ పాలనలో సహకరించిన ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.ఆర్టీసీ నాగిరెడ్డి మాట్లాడుతూ..నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను దశలవారీగా పెంచుతున్నట్లు తెలిపారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా మెరుగుపరిచేందుకు ఎంఎంటీఎస్ స్టేషన్ , మెట్రో స్టేషన్‌లకు బస్ కనెక్టివిటీ పెంచాల్సిన అవసరం ఉందన్నారు.జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ మాట్లాడుతూ...గ్రేటర్‌లో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత ప్రభావంతంగా జరిగేందుకు పర్యవేక్షణ బాధ్యతలను మెడికల్ అధికారుల నుంచి ఇంజనీర్లకు అప్పగించామన్నారు. హెచ్ సిటీ, డీ సిల్టింగ్ పనులను టైమ్ బౌండ్ తో పూర్తి చేస్తామని తెలిపారు. ఈసమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభ న్ రెడ్డి, అదనపు,జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రేపటి నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి వార్షికోత్సవాలు

జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయం

జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి

జూబ్లీహిల్స్, జనవరి 21, ప్రభాతవార్త: ఈ నెల 23 నుంచి 26 వరకు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి 32వ వార్షిక మహోత్సవాలు, రథోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ పి. విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 23న ఉదయం 3 గంటలకు పెద్దమ్మతల్లికి అభిషేకం, ఉదయం 6 గంటలకు దర్శనం, హారతి, ఉదయం 9.45 గంటలకు దివంగత పీజేఆర్ కుమారుడు పి. విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణం, అఖండ దీపారాధన, కలశ స్థాపన, వేదపారాయణాలు, ఛండీపారాయణాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. అలాగే సాయంత్రం 5 గంటలకు అగ్నిప్రతిష్టాపన, అనుష్టాన మంత్రం, మండప పూజలు, రాత్రి 8 గంటలకు పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తి పల్లకి సేవ నిర్వహించనున్నారు. 24న, 25న పూజా కార్యక్రమాలతోపాటు 25న ఉదయం 8 గంటలకు నవగ్రహ, రుద్ర ఛండీ హోమాలు, 11 గంటలకు దిక్పాలక భైరవ బలిహరణం, 12 గంటలకు రథపూజ నిర్వహించనున్నట్లు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తి ఊరేగింపుతోపాటు విశేష బాణసంచా విన్యాసాలను నిర్వహిస్తామన్నారు.

26న పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తికి పుష్కరిణిలో అవభృత స్నానం నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల నేపథ్యంలో 23, 24 తేదీల్లో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని ఆలయ ఈవో జి. శ్రీనివాస రాజు తెలిపారు.

సరూర్‌నగర్ చెరువు హైడ్రా టేకోవర్ : కమిషనర్ రంగనాథ్

సైదాబాద్, జనవరి 21 ప్రభాతవార్త: సరూర్‌నగర్ చెరువును బతుకమ్మ కుంట మాదిరిగా అభివృద్ధి చేస్తామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ అన్నారు. బుధవారం సరూర్‌నగర్ చెరువును సందర్శించిన ఆయన చెరువు విస్తీర్ణం, మురుగునీటి ప్రవాహం, పార్కు, ఎస్‌టిపిల పనితీరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హైడ్రా కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ చెరువు విస్తీర్ణం దాదాపు 150 ఎకరాలు ఉన్నప్పటికీ కబ్జాలకు గురికావడంతో ప్రస్తుతం 90 ఎకరాలకు మాత్రమే పరిమితమైందన్నారు. ప్రభుత్వ అనుమతులు రాగానే సరూర్‌నగర్ చెరువు పునరుద్ధరణ పనులు చేపడుతామన్నారు. నివాసాల జోలికి తాము వెళ్లమని చెరువులో పూడికతీత, బండ్‌ను బలోపేతం చేయడం, సుందరీకరణను చేపడుతామని అన్నారు. వరదనీరు చెరువులోకి సాఫీగా వచ్చేలా ఇన్‌లెట్, అవుట్‌లెట్ ఛానల్స్ అన్నింటిని పునరుద్ధరిస్తామని అన్నారు. మురుగునీరు చెరువులోకి రాకుండా చర్యలు చేపడుతామని, ఎస్‌టిపిల కెపాసిటి పెంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. హైడ్రా స్టాండర్డ్స్‌కు అనుగుణంగా సరూర్‌నగర్ చెరువును పునరుద్ధరణను ఏడాదిలోగా పూర్తి చేస్తామని అన్నారు. కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రూ.6 కోట్లతో చెరువు చుట్టూ బండ్ నిర్మాణంనచేపడుతున్నామని, బ్యూటిఫికేషన్‌కు మరో రూ.6 కోట్లు మంజూరయ్యాయని, పార్కు ముందు బ్రిడ్జి నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయని, వీటి టెండరు ప్రక్రియ పూర్తి కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, హైడ్రా అడిషనల్ కమీషనర్ పాపయ్య, డిఎస్‌పి తిరుమల్, డిప్యూటి సిటీ ప్లానర్ రాంరెడ్డి, హైడ్రా ఇన్‌స్పెక్టర్ సైదులు, ఇఇలు కార్తీక్, రామకృష్ణ, డిఇలు చందన, రవిచంద్ర, ఎఇ సురేష్, స్థానిక నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కందికంటి శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్

సూరారంలో శునకాల స్వైర విహారం..

-కాలనీలో కుక్క కాటు కలకలం
-ఐదేళ్ల బాలుడిని గాయపరిచిన వీధి కుక్కలు
-గాయపడిన బాలుడిని ఆస్పత్రికి తరలింపు
-వీధి కుక్కల సమస్యను పట్టించుకొని సిబ్బంది
-అధికారుల నిరక్ష్యంపై స్థానికుల ఆందోళన

గాయాలతో బాలుడు

సూరారం, జనవరి 21, ప్రభాతవార్త మహానగరం పురపాలక జోన్లు, డివిజన్ల విభజనలతో రాజకీయ లబ్ధి పొందే చర్యలు తప్ప నగర వాసులను సంరక్షించే చర్యలు ఏ మాత్రం ఎక్కడా కానరావడం లేదు. ఓ వైపు బస్తీలలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, వీధులు పేరుకుపోతున్న చెత్తా చెదారంకు తోడు వీధులలో గుంపులు గుంపులుగా స్వేచ్ఛ స్వైర విహారం చేస్తున్న శునకానందంగా వీదికుక్కల దాడులతో జనం సతమతమవుతున్నా స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు అధికార యంత్రాంగానికి ఏమాత్రం కనువిప్పుకావడం లేదు. వీధి కుక్కలను కట్టడి చేయాలని వినతులను కూడా పట్టించుకోకుండా వ్యవహరిస్తుండటంతో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ పిల్లలు పెద్దలు తేడా లేకుండా కాటు వేసి గాయపరుస్తున్న ఘటనలు కలకలం రేపుతున్నాయి.

ఐదేళ్ల బాలుడిని గాయపరిచిన వీధి కుక్కలు..

కుత్బుల్లాపూర్ జోన్ సాయిబాబ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీలో ఆదివారం జై శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన ఎల్ కేజీ విద్యార్థి ఐదేళ్ల అభిలాష్ అనే బాలుడిపై వీది కుక్కలు దాడి చేసి గాయపరిచిన ఘటన అధికారులు సిబ్బంది నిరక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. హుటా హుటిన బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అధికారుల నిరక్ష్యంతోనే కుక్కల దాడులు..

కుత్బుల్లాపూర్ జోన్ సాయిబాబ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ జై శ్రీరామ్ నగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా వీధి కుక్కల సమస్య విపరీతంగా మారింది. వీధులలో బయటకు వెళ్లాలంటేనే జనం భయంతో వణికిపోతున్నామని, కుక్కలను పట్టుకునేందుకు పురపాలక యంత్రాంగం ఏర్పాటు చేసిన ఎనిమల్ ట్రాకర్ సిబ్బంది నిరక్ష్యంగా వ్యవహరిస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ కాలనీలో కుక్కలు పిల్లలు పెద్దల పై దాడులు చేస్తున్నాయని పలుమార్లు ఫిర్యాదులు చేసినా కూడా కనీసం స్పందించకపోవడంతో కుక్కల సమస్య కంటిమీద కునుకులేకుండా చేస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు పదే పదే ఫిర్యాదులు చేసినా ఏ ఒక్క రోజు కూడా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ వార్త

పనికావాలంటే..చేయి తడపాల్సిందే

-డబ్బులివ్వనిదే దస్త్రం కదలదు..
-ఇదీ ప్రభుత్వ కార్యాయాల్లో సిబ్బంది తీరు
-ఎసిబి దాడుల్లో వెలుగులోకి అవినీతి జలగలు



హైదరాబాద్, జనవరి 21,ప్రభాతవార్త: లబ్దిదారులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం, ఇతర ప్రయోజనాలు ఏవైనా ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వందే దస్త్రం కదలని పరిస్థితి నెలకొంది. చేయి తడిపితేకానీ అధికారులు పనులు చేయడం లేదనే విమర్శలు బహిరంగానే వినిపిస్తున్నాయి. ఆస్తి బదలాయింపు, నల్లాకనెక్షన్, పవర్ కనెక్షన్, ఇంకా ఇతర ప్రభుత్వ పథకాలు వర్తించాలన్నా విచారణధికారులు చేతులు తపడాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. జిహెచ్ఎంసీ,వాటర్‌బోర్డ్, ఎలక్ట్రిసిటీ, రెవెన్యూ ఇలా అనేకశాఖల్లో అవినీతి తాండవిస్తోంది.తమపనులు చేసిపెట్టాలని వెళ్లిన లబ్దిదారులు డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రం లో లేనిపోని కారణాలు చూపిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణంగా మారింది. పనులకోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయిన లబ్దిదారులు రాజీపడి విధిలేని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టచెప్పి వారిపనులు చేయించేకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేయి తడిపితే మాత్రం అధ్రువపత్రాలు ఉన్నా లేకున్నా పనులు చకచకా చేసిపెడుతున్నారు. లంచావతారుల బెడద తప్పించడానికి ప్రభుత్వం పలురకాల ప్రయోజనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు ప్రవేశపెట్టింది. అయితే ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునప్పటికీ సంబంధిత విచారణాధికారిని కలువకపోతే ఆశించిన ప్రయోజనం అందుబాటులోకి రాకుండా పోతుంది. సదరు అధికారిని కలిసి ఎంతో కొంత ముట్టచెబితేనే సకాలంలో పనుల య్యేలా చూస్తున్నారు. వేలకు వేల రూపాయలు వేతనాలు రూపంలో పొందుతున్న అధికారుల దిగజారుడుతనం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

కేసుల అంతంతమాత్రమే..

అవినీతి నిరోధక శాఖ (ఏసీబి) రెండు రకాల కేసులు నమోదు చేస్తుంది. అధికారులు ఎవరైనా పనులు చేయటానికి లంచాలు అడుగుతున్నట్లు బాధితులు ఫిర్యాదు చేస్తే డబ్బులు అందించేటప్పుడు వలపన్ని అధికారులను పట్టుకుంటారు. రెండోది..ఆదాయానికి మించి ఆస్తులున్న వ్యాపారులు,అధికారులను సైతం,ఇళ్లు, వారి వ్యాపార కేంద్రాలపై దాడులు చేసి పట్టుకుంటారు. అయితే బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు అక్కడక్కడ లంచావతారులను పట్టుకుంటున్న అధికారులు ఆదాయానికి మించి ఆస్తులున్నవారిపై దృష్టి సారించడం లేదు. ఇలాంటి వారిపై రహస్యంగా విచారణ జరిపి పట్టుకోవాల్సి ఉండగా ఇలాంటి కేసుల విషయంలో ఆసక్తి కనబరచడం లేదు. పలు ప్రభత్వశాఖల్లో లంచాలు పెరుగుతున్నా కేసులు మాత్రం పెరగటం లేదు. ఏసీబికి దొరికిన అధికారులు ఏదోఒక రాజకీయ నాయకుడి అండతో కొంతకాలంపాటు దూరప్రాంతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మళ్ళీ పాతపాటే పాడుతున్నారు. కారణం అవినీతి నిరోదక శాఖ గురించి ప్రజల్లో అవగాహాన లేకపోవడమేనని తెలుస్తుంది. దీంతో ప్రతి ఏడాది కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఏదోలా మనపని అయిపోయిందనే ధోరని కారణం వల్ల పలువురు ఫిర్యాదులు చేయడానికి ఆసక్తి కనబరచడం లేదు. ఈవిషయంలో ఉన్నతాధికారులు ప్రజల్లో అవగాహాన కల్పించాల్సి అవసరం ఉంది.

కొనసాగుతున్న మీర్ ఆలం మండి ఆధునీకరణ పనులు

- కుడివైపు మోండాలు, షెడ్లు పూర్తి
- ఇనుప దిమ్మెలతో కమాన్ సుందరీకరణ

మీర్ ఆలం మండీ మధ్యలో గల మొండాలను, షెడ్లను తొలగించి జరుగుతున్న పనులు

చాంద్రాయణగుట్ట, జనవరి 21, ప్రభాతవార్త : దాదాపు రెండు వందల ఏళ్ళకు పైగా చరిత్ర గల మీర్ ఆలం మండీ అధునీకరణ పనులు గత రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. నిజాం కాలంలో నగర ప్రజల అవసరాల కోసం సుమారు ఐదు ఎకరాల స్థలంలో మూడు వందలకు పైగా వ్యాపారులు కూరగాయలు విక్రయించుకునేలా తగిన అవసరలతో మొండాలను నిర్మించారు. నగర శివారు గ్రామాల నుండి రైతులు తాము పండించిన కూరగాయలను మీర్ ఆలం మండికి తరలించి గిట్టుబాటు ధరలకు అమ్ముకునేవారు. తూర్పు వైపు నుండి మార్కెట్‌లోకి ప్రవేశించే మార్గంలో ఐకానిక్ హెరిటేజ్ ఆర్చ్ (కమాన్) నిర్మించారు. కాల క్రమేణ మార్కెట్ స్థలం కుంచించుకుపోయింది. ఆర్చ్ పెచ్చులూడి కళావీహీనంగా మారింది. మొండాలపై షెడ్లు కుంగిపోయి, విరిగిపోయి వర్షం పడితే కరుస్తున్నాయి. విక్రేతలు, కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి లోనైతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారుల నుండి వచ్చిన వినతులతో స్పందించిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆధునీకరణ పనులు చేపట్టింది. గత రెండేళ్ళ క్రిందట దశల వారీగా పనులు ప్రారంభించి, ఆర్చ్‌ని బలోపేతం చేసేందుకు భారీ ఇనుప దిమ్మలతో కమాన్‌ను సుందరీకరించారు. ఆ తరువాత ఆర్చ్‌కి కుడివైపు గల మొండాలు, షెడ్ల స్థానంలో ఆధునిక నిర్మాణాలు చేపట్టారు. గత కొన్ని నెలల క్రిందట వాటి పనులు పూర్తైయ్యాయి. ప్రస్తుతం మధ్యలో ఉన్న పాత మొండాలను, షెడ్లను తొలగించి, వాటి స్థానింలో ఆధునిక నిర్మాణాలు ప్రారంభించారు. పనులు కొనసాగుతున్నాయి. ఆ తరువాత కమాన్‌కు ఎడమవైపు గల మొండాలను, షెడ్లను తొలగించి ఆధునిక నిర్మాణాలు చేపడితే మీర్ ఆలం మండిలో పాత నిర్మాణాల స్థానంలో ఆధునిక నిర్మాణాలు కనిపించనున్నాయి. అదేవిధంగా వర్షం నీరు వెళ్ళేందుకు వరద నీటి కాలువలు, తగిన డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థలు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం చేపడితే కూరగాయల విక్రేతలకు, కొనుగోలుదారులకు ఎంతో సౌకర్యాంగా ఉండనుంది.

బిసిలను మోసం చేసిన పార్టీలకు బుద్ధి చెప్పడానికి 'బస్ యాత్ర'

-మున్సిపల్ ఎన్నికల జనరల్ స్థానాల్లో బిసిలు పోటీకి సిద్ధం
-ఫ్రంట్ ఛైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్ హెచ్చరిక

అభివాదం చేస్తున్న బాల్‌రాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, నారాయణగౌడ్ తదితరులు

సైఫాబాద్, జనవరి 21 ప్రభాతవార్త: బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించకుండా గ్రామ పంచాయితీరాజ్ ఎన్నికల్లో అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల్లో కూడా మోసం, దగా చేస్తున్నదని బిసి పొలిటిక్ ఫ్రంట్ ఆరోపించింది. బిసిలకు జరిగిన అన్యాయాలపై ప్రతిపక్ష పార్టీలైన బిజెపి, బిఆర్ఎస్ నోరు మెదపకపోవడం సిగ్గు చేటని ఫ్రంట్ నిశితంగా విమర్శించింది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పడానికి బిసిలలో చైతన్యం తీసుకురావడానికి త్వరలో 'బిసిల చైతన్య బస్ యాత్ర'ను రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని ఫ్రంట్ ఛైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్ హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల అయితే ఆదే రోజు నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందని, ఈ బస్ యాత్ర మహాసముద్రంలాగా కొనసాగతుందని ఆయన తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫ్రంట్ ఉపాధ్యక్షుడు ఎస్.దుర్గయ్యగౌడ్ అధ్యక్షతన కన్వీనర్లు అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేయకుండా తుంగలో తొక్కారని, రెండేళ్ళపాటు బిసిలను నయవంచన చేశారని బాల్‌రాజ్‌గౌడ్ ధ్వజమెత్తారు. ఈ మూడు పార్టీలు బిసిలను మోసం చేయడానికి పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతున్నాయని, వీటిని బిసిలు ఐక్యంగా చేధించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఈ మూడు పార్టీలకు బుద్ధి చెప్పిన విధంగా మున్సిపల్ ఎన్నికల్లో కూడా గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బిసిలు రిజర్వేషన్ స్థానాలతోపాటు జనరల్ స్థానాల్లో పోటీ చేసి అగ్రకుల పార్టీలను ఓడించాలని ఆయన కోరారు. బిసి రిజర్వే షన్‌లపై అధికార పార్టీ, ప్రతి పక్ష పార్టీలు అసెంబ్లీలో చర్చించకుండా జలా ల విషయంలో చర్చించి బిసిలకు తీరని అన్యాయం చేశారని, కెసిఆర్ సైతం ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఫాం హౌస్‌కే పరిమితమైనారని ఆయన ఆరోపించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అప్పగించిన ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చాంద్రాయణగుట్ట, జనవరి 21, ప్రభాతవార్త : పాతబస్తీ ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ సందర్భాలలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి బుధవారం వాటిని తిరిగి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన సెల్‌ఫోన్లను వెతికి పట్టారు. 20 మంది బాధితులను స్టేషన్‌కు పిలిపించి వాటిని అప్పగించారు. వీటి విలువ సుమారు మూడు లక్షల 50 వేల రూపాయలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. తమ సెల్‌ఫోన్లను క్షేమంగా వెతికిపట్టి, అప్పగించిన ఇన్‌స్పెక్టర్ సీతయ్యకు, సిబ్బందికి బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

బేగంపేట ఫ్లై ఓవర్ పై కారు బోల్తా...ఇద్దరికి గాయాలు

,బేగంపేట ఫ్లై ఓవర్ పైన ప్రమాదానికి గురైన కారు.

బేగంపేట జనవరి 21,ప్రభాతవార్త బేగంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైన మధ్యలో ఉన్న డివైడర్ ను బుధవారం ఉదయం సమయంలో కారు ఢీ కొని బోల్తా కొట్టింది.ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి.బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలను పోలీసులు తెలియజేసారు.నాచారంలోని అన్నాపురం కాలనీకి చెందిన డ్రైవర్ పి.నర్సింహులు తన స్విఫ్ట్ డిజైర్ కారులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన బాలాజీ అనే యువకుడిని ఎక్కించుకుని యాప్రాల్ నుంచి కొండాపూర్ వైపు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది.ఉదయం గం 6.15నిల సమయంలో బేగంపేట బ్రిడ్జిపైకి చేరుకున్న కారు మధ్యలోకి వచ్చిన తరువాత డ్రైవర్ మంచినీరు తాగేందుకు సీసా తీసాడు.ఈ సమయంలో కారు ఒక్క సారిగా ఎదురుగా ఉన్న డివైడర్ ను ఢీకొని కారు బోల్తా పడింది.ఈ సంఘటనలో డ్రైవర్‌తో పాటు బాలాజీ అనే యువకుడికి గాయాలయ్యాయి.ఇది గమనించిన వారు హుటా హుటిన ప్రమాదస్థలానికి చేరుకుని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడ ఉన్న వారి సాయంతో బోల్తా పడిన కారును పక్కకు తప్పించారు.ఈ సమయంలో ఫ్లై ఓవర్ తో పాటు బేగంపేట లో ట్రాఫిక్ జాం అయింది.ఈ మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మరో యువకుడి బలి

సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మరో యువకుడు బలయ్యాడు. బెట్టింగ్‌కు బానిసై లక్షలు వెచ్చించి ఆర్థికంగా అప్పుల్లో కూరుకుపోయిన బాధితుడు చివరకు జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే బాత్రూంలో ఉరేసుకొని బలవర్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన హైదరాబాద్ సమీపంలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కర్నూల్ ప్రాంతానికి చెందిన కోట్ల లక్ష్మీకాంత్ (24) నందనవనంలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. అయితే గత కొన్ని నెలలుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఈ క్రమంలో లక్షలు నష్టపోయి చివరకు అప్పుల పాలయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మీకాంత్ జీవితంపై విరక్తి చెంది తనువు చాలించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లోనే బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు సోదరుడు కోట్ల రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంఎస్ మక్తాలో పైపులైను పనులు ప్రారంభించిన కార్పొరేటర్

పైపులైను పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి.

జూబ్లీహిల్స్, జనవరి 21, ప్రభాతవార్తః
ఖైరతాబాద్ డివిజన్‌లోని ఎంఎస్ మక్తాలో పైపులైను పనులను ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ పి. విజయారెడ్డి బుధవారం ప్రారంభించారు. రూ. 23 లక్షల వ్యయంతో ఈ పనులను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 200/150 డయా మంచినీటి పైపులైన్లు ఇక్కడ వేస్తున్నామన్నారు. స్థానికంగా ఈ ప్రాంత వాసులు తాగునీటి సరఫరాలో లోపాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ పనులు పూర్తి చేయడం ద్వారా వారి దాహర్తికి శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.కె. షరీఫ్, దాదాబాయి, రఫీ, నాసర్, బాబా బాయ్, అహ్మద్‌లతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

హిందుత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

హిందూ ధర్మ పరిరక్షణ అఖిల భారత హిందూ మహాసభ జాతీయ అధ్యక్షురాలు రాజశ్రీ చౌదరిను కలిసిన పల్లె లక్ష్మణ్ రావు, బాలరాజ్ గౌడ్ తదితరులు

చిక్కడపల్లి జనవరి 21 ప్రభాతవార్త : దేశవ్యాప్తంగా హిందూ ధర్మాన్ని రక్షిస్తూ హిందుత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని హిందూ ధర్మ పరిరక్షణ అఖిల భారత హిందూ మహాసభ జాతీయ అధ్యక్షురాలు రాజశ్రీ చౌదరి అన్నారు. బుధవారం దక్షిణ భారత సనాతన ధర్మ యాత్రలో భాగంగా నిర్వహిస్తున్న సనాతన ధర్మ రక్షణ-పునరుద్ధరణ యాత్ర సందర్భంగా రాజశ్రీ చౌదరి లను అఖిల భారత హిందూ మహాసభ తెలంగాణ ప్రాంత అధ్యక్షులు గడ్డమీది కళ్యాణ్ గౌడ్ , తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు, నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి. అనురాధ ,ఆదర్శ కిరణం బీసీల మాసపత్రిక ప్రధాన సంపాదకులు వంగాల బాలరాజ్ గౌడ్, ప్రముఖ పాత్రికేయులు వసంత్ కుమార్, జంట నగరాల ప్రముఖులు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశ్రీ చౌదరి మాట్లాడుతూ నేటి యువత సనాతన ధర్మ విలువలను అవగాహన చేసుకొని, హిందూ సంస్కృతి పరిరక్షణలో చురుకుగా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో 138 మున్సిపాలిటీలు కైవసం

హైదరాబాద్, జనవరి 21 ప్రభాతవార్త: వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేజార్టి స్థానాలను కైవసం చేసుకుంటుందని తెలంగాణ పిసిసి ఉపాధ్యక్షుడు, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జ్ నవాబ్ ముజాహిద్ అలంఖాన్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సిఎం రేవంత్‌రెడ్డి 138 మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 2,780 కోట్లు మంజూరు చేసి అభివృద్ధిలో కొత్త చరిత్రను సృష్టించారని ఆయన కొనియాడారు. బుధవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీలను పూర్తిగా విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు దుడ్డు బియ్యాన్ని అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యాన్ని అందిస్తున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు పంపిణి, ఇందిర మ్మ ఇళ్ళు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇవ్వడం జరిగిందని, మహిళలకు ఉచితంగా బస్ సౌకర్యం, రైతులకు రెండు లక్షల రుణమాఫి,రైతుల పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా తదితర ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని ఆయన వివరించారు.

నేడు పిఎం సంసద్ ఖేల్ ప్రారంభం

ఎల్‌బి స్టేడియంలో ఏర్పాట్లుపై మాట్లాడుతున్న కావ్యారెడ్డి

సైఫాబాద్, జనవరి 21 ప్రభాతవార్త: బషీర్‌బాగ్‌లోని ఎల్‌బి స్టేడియంలో గురువారం ప్రారంభం కానున్న 'పిఎం సంసద్ ఖేల్ మహోత్సవ్' ఏర్పాట్లును బుధవారం కేంద్ర బోగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఎంపిలు సంసద్ ఖేల్ పోటీలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో 30 గ్రౌండ్స్‌లో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే సుమారు 30 వేల మంది క్రీడాకారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగిందన్నారు. క్రికెట్, కబడ్డి, వాలీబాల్, కొక్కోతోపాటు మహిళల కోసం మ్యూజికల్ ఛైర్స్, టాగ్గఫర్ పోటీలు కొనసాగుతాయని ఆమె వివరించారు. ఈ పోటీలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతోపాటు కే ంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు.

తప్పుడు కేసులు బనాయించడం సరైంది కాదు : మన్నెక్రిషాంక్

సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ మీడియా కో ..ఆర్డినేటర్ మన్నెక్రిషాంక్ తదితరులు

కంటోన్మెంట్,జనవరి 21 ప్రభాతవార్త: కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపితే ఆ పత్రాలు పెట్టిన కుర్చీ దగ్ధం కావడం వల్ల బోర్డు కార్యాలయంలో ప్రాణ నష్టం ఉండేదని, బోర్డు అధికారులు తప్పుడు కేసు నమోదు చేయించడం బాధకరమని బిఆర్ఎస్ అధికార ప్రతినిధి,సోషల్ మీడియా కో.. ఆర్డినేటర్ మన్నెక్రిషాంక్ తెలిపారు. బుధవారం పికెట్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తప్పుడు పత్రాలు పెట్టి దగ్ధం చేసిన కుర్చీ ఇప్పటికి సురక్షితంగా ఉందని చూపించారు. ఆ కుర్చీ వల్ల ఎలాంటి ప్రమాదం జరగలేదంటూ పూలమాలలు వేశారు. అధికారులు ఫిర్యాదుకు సంబంధించిన స్క్రిప్ట్‌ను బిజెపి,కాంగ్రెస్ పార్టీ వారు రాయించినట్లు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. విలీనం,ఎన్నికల విషయంలో అయోమయం పరిస్థితుల్లో ఉన్న కంటోన్మెంట్ ప్రజలకు ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాలను జిహెచ్ఎంసీలో విలీనం చేసేంత వరకు కంటోన్మెంట్ బోర్డు స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు.

నగరాభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా చర్యలు : మంత్రి పొన్నం ప్రభాకర్

ముషీరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త: నగరాభివృద్ధికై ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం దోమలగూడలోని కవాడిగూడ, ముషీరాబాద్ సర్కిల్ కార్యాలయాలను ఆయన మేయర్ గద్వాల విజయలక్ష్మి, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, డిప్యూటి మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమీషనర్ రవికిరణ్, కార్పొరేటర్‌లు రచనశ్రీ, కే.రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా ప్రజల సౌలభ్యం కోసం రింగ్‌రోడ్డు లోపల ఉన్న గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్‌లు ఒకే రకమైన వ్యవస్థలోకి తీసుకురావటం జరిగిందన్నారు. హైదరాబాద్ నగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా విభజించి, దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పోరేషన్‌గా ఏర్పాటు చేయటంతో పాటు, జీహెచ్ఎంసీలో విలీనమైన ప్రాంతాల అభివృద్ధిపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ తీసుకోవటం జరిగిందని తెలిపారు. కాలుష్యం వల్ల హైదరాబాద్‌కు ఢిల్లీ పరిస్థితి రాకుండా ఉండాలనే కార్యచరణతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చటానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 10.50 కోట్లతో సర్కిల్ కార్యాలయ నిర్మాణం

కవాడిగూడ, ముషీరాబాద్ సర్కిల్ కార్యాలయాలను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

చేపట్టి, పూర్తి చేశామని, ఎన్నికల కోడ్ వల్ల ప్రారంభోత్సవం ఆలశ్యమయిందని గుర్తు చేశారు. ముషీరాబాద్ ప్రజలకు తన హయాంలో సర్కిల్ కార్యాలయం, అశోక్‌నగర్, దోమలగూడలను కలుపుతూ లింక్ బ్రిడ్జ్‌లు అందుబాటులోకి రావటం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమీషనర్లు రామాంజనేయులురెడ్డి, పుష్పలత, ఎఎంసీలు భాగ్యలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, వాణి, ఇతర జీహెచ్ఎంసీ సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కావాలనే అభివృద్ధి పనులు ప్రారంభం

బుధవారం కేంద్ర క్యాబినేట్ సమావేశం ఉన్నందున కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరుకాలేరని, అయినప్పటికీ కావాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు అభివృద్ధి పనులను ప్రారంభించటం సరికాదని కవాడిగూడ కార్పోరేటర్ రచనశ్రీ, మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రమేష్‌రాం, కార్యదర్శి సలంద్రి శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్ తదితర బీజేపీ నేతలు ఆరోపించారు. నూతన సర్కిల్ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు.

దళితులకు జీహెచ్ఎంసీ ఎన్నికలలో సీట్లు పెంచాలి
-నిరసన తెలిపిన దళిత ఐక్యవేదిక నేతలు

జీహెచ్ఎంసీ ఎన్నికలలో దళితులకు సీట్లు పెంచాలని, ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లపై దళితులకు అన్యాయం జరిగిందని దళిత ఐక్యవేదిక నేతలు ఆరోపించారు. సర్కిల్ కార్యాలయ ప్రారంభోత్సవ సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదుట వారు ప్లక్కార్డ్లతో నిరసన తెలియచేశారు. 150 డివిజన్‌లు ఉన్న సమయంలో దళితులకు 23సీట్లు కేటాయించారని, ఇప్పుడు డివిజన్లు 300కు పెంచిన సందర్భంగా ఎస్సీలకు 14శాతం రిజర్వేషన్ల ప్రకారం 46 డివిజన్‌లు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళిత ఐక్య వేదిక నాయకులు గండికృష్ణ, గజ్జెల సూర్యనారాయణ, మన్నె శ్రీదర్‌రావు, కే.వినయ్‌కుమార్ తదితరులు మంత్రికి వినతిపత్రం అందచేశారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మీ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

డ్రైవర్ల దృష్టి-రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

తార్నాక, జనవరి 21 ప్రభాతవార్త : దేశంలో ప్రముఖ కంటి సంరక్షణ సంస్థ వాసన్ ఐ కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో డ్రైవర్లలో మెరుగైన దృష్టి ద్వారా రోడ్డు భద్రతను పెంపొందించాలనే లక్ష్యంతో నగరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన కంటి దృష్టి అత్యంత కీలకమని, దృష్టి లోపాల వల్ల రోడ్డు ప్రమాదాల ముప్పు పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం జనవరి 11 నుంచి ఫిబ్రవరి 11, 2026 వరకు నెల రోజుల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా భారీ వాహన డ్రైవర్లు, బస్సు, ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు, అవగాహన అందించనున్నారు. వాసన్ ఐ కేర్ వైద్య బృందం మాట్లాడుతూ, డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం వల్ల తమ భద్రతతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా కాపాడ గలరని అన్నారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ రవి కుమార్,డాక్టర్ మయూరి బత్తుల,డాక్టర్ ఎస్.వి. ఫాతీమ షాజియా,డాక్టర్ నిఖిల్ పాల్గొని డ్రైవర్లకు కంటి ఆరోగ్యం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ అధికారి యాదయ్య డ్రైవర్ల కోసం రూపొందించిన డ్రైవర్ దృష్టి ప్రివిలేజ్ కార్డులను అధికారికంగా ప్రారంభించారు.కంటి దృష్టి ప్రాముఖ్యతపై డ్రైవర్లలో అవగాహన పెంపొందించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని వాసన్ ఐ కేర్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

ప్రతి విద్యార్థి అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ లింబాద్రి, సరోజ వివేక్ తదితరులు

చిక్కడపల్లి జనవరి 21 ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ విద్యాసంస్థల సి ఈ ఓ ప్రొఫెసర్ లింబాద్రి అన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి డా. బి.ఆర్. అంబేద్కర్ స్వయంప్రతిపత్తి కళాశాలలో ప్రఖ్యాత ఔషధ సంస్థ ఎం ఎస్ ఎన్ ల్యాబొరేటరీస్ సహకారంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ జరిగింది. ఇంటర్, డిగ్రీ , బి ఎస్సి (కెమిస్ట్రీ బ్యాక్‌గ్రౌండ్), ఎం ఎస్సి (ఆర్గానిక్ కెమిస్ట్రీ) విభాగాలకు చెందిన 127 మంది అర్హులైన విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా మొదట రాత పరీక్ష నిర్వహించగా, అనంతరం సాంకేతిక హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించగా 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్ కారస్పాండెంట్ ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ, పాల్గొన్న ప్రతి విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాలు విద్యార్థుల వృత్తి జీవితానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రిన్సిపాల్ డా. శేఖర్ మట్టా పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. ప్లేస్‌మెంట్ సెల్ పనితీరును ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని సంస్థలతో ఇలాంటి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఔషధ సంస్థకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

పేద యువతులకు వరంగా కళ్యాణలక్ష్మి : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- గండిపేట మండలంలో 50.మందికి చెక్కులు పంపిణీ

నార్సింగి, జనవరి 21 ప్రభాతవార్త : నిరుపేద యువతులకు కళ్యాణలక్ష్మీ పతకం వరంగా మారిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం గండిపేట మండలంలోని ఖానాపూర్ కమ్యూనిటీహాల్‌లో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్‌తో కలిసి 50.మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమ పతకాలకు పెద్దపీఠ వేయడం జరుగుతుందన్నారు. నిరుపేద తల్లిదండ్రులకు ఆర్థిక భారంను తగ్గించేందుకు కళ్యాణలక్ష్మీ/షాదీముబారక్ పతకాల కింద రూ.లక్షా 116 చెక్కులను అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఈ పతకం కింద దరఖాస్తు చేసుకొని, లబ్దిపొందాలని ఎమ్మెల్యే సూచించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, కళ్యాణలక్ష్మీ, సిఎం సహాయ నిధి, గృహలక్ష్మీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి సంక్షేమ పతకాలు పేదలకు చాలా ఉపయుక్తంగా మారాయన్నారు. గండిపేట మండలంలో 14.మంది బిసి అండ్ ఇబిసి, 17.మంది ఎస్సీ, 17.మంది ఎస్ఎం, 2.ఎస్టీలకు మొత్తం 50.మందికి రూ.50.లక్షల 5,800. డబ్బులను కళ్యాణలక్ష్మీ పతకం కింద జమ చేయడం జరిగిందని, లబ్దిదారులు బ్యాంకుల నుంచి డబ్బులు నరడా చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, సీనియర్ నాయకులు రామేశ్వరం నర్సిహ్మా, జి.వెంకటేష్ యాదవ్, అమరేందర్‌రెడ్డి, టి.కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ కమ్యూనిటీహాల్‌లో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్.

దర్గా హజ్రత్ షేక్ జీ హాలిలో సూఫీ బసంత్ ఉత్సవం

చార్మినార్,జనవరి 21 ప్రభాతవార్త : సర్వమత సమానత్వం,భారతీయ సమ్మిళిత సంస్కృతికి ప్రతీకగా నిలిచేసూఫీ బసంత్ ఉత్సవాన్ని ఈ నెల 23వ తేదీన ఫత్తర్‌గట్టి వెనుక ఉన్న ఉర్దూ షరీఫ్‌లోని దర్గాహ్ హజ్రత్ షేక్ జీ హాలిలో నిర్వహించనున్నామని కన్వీనర్ ముజాఫర్ అలీ సూఫీ చిస్తీ సజ్జాదా నషీన్ తెలిపారు.బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కార్యక్రమం కన్వీనర్ ముజాఫర్ అలీ మాట్లాడుతూ ఆల్ ఇండియా మర్కాజీ మజ్లిస్-ఏ-చిస్తియా ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్ట్ కల్చరల్ కౌన్సిల్ సహకారంతో సూఫీ బసంత్ ఉత్సవాని జరుపుతున్నామని తెలియజేశారు.ఉర్దూ షరీఫ్‌లోని దర్గాహ్ హజ్రత్ షేక్ జీ హాలిలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు మెహిఫిల్-ఏ- నిజామి (ఖవ్వాలీ) కార్యక్రమం ఉంటుందని,వివిధ మాతాలు,సంస్కృతుల ఐకత్యను చాటే విధంగా సూఫీ బసంత్ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.సూఫీ బసంత్ ఉత్సవం సందర్భంగా మహానుభావుడు హజ్రత్ అమిర్ ఖుస్రో రచించిన అపూర్వ గీతాలను ప్రముఖ ఖవ్వాలీలు ఖవ్వాలీ కార్యక్రమంలో ఆలపించనున్నారని ఆయన తెలియజేశారు.పసుపురంగు కుర్తాలు, సారీలు,టోపీలు, స్కార్ఫులు ధరించి ఉత్సవాలలో పాల్గొనాలని ఆయన తెలిపారు.23వ తేదీ శుక్రవారం జరగనున్న సూఫీ బసంత్ ఉత్సవంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్,ఇరాన్ కౌన్సిల్ హమిద్ అహ్మది యాహ్,హజ్రత్ మౌలానా సయ్యద్ అక్బర్ నిజాముద్దీన్ హుస్సేనీ సాబ్రీ,చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్,తెలంగాణ కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులు కైలాష్ బి.కుమార్‌తో పాటు పండితులు,కళా సాంస్కృతిక రంగ ప్రముఖులు,బౌద్ధ,సిఖ్,క్రైస్తవ,పార్షీ మతాలకు చెందిన ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొంటున్నారని ఆయన తెలియజేశారు.సూఫీ సంప్రదాయం బోధించే ప్రేమ, శాంతి,మానవత్వ సందేశాన్ని సమాజంలో వ్యాప్తి చేయడమే సూఫీ బసంత ఉత్సవం ప్రధాన లక్ష్యమని కన్వీనర్ సజ్జాద్ నషీన్ ముజాఫర్ అలీ సూఫీ తెలిపారు.ఉర్దూ షరీఫ్‌లోని దర్గాహ్ హజ్రత్ షేక్ జీ హాలికి రెండు వందల యాభై సంవత్సరాల చరిత్ర ఉందని ఆయన తెలియజేశారు.



ఉర్దూ షరీఫ్‌లోని దర్గాహ్ హజ్రత్ షేక్ జీ హాలి

కెటిఆర్‌ను కలిసిన వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం

కెటిఆర్‌ను ఆహ్వానిస్తున్న దినేష్‌పాటిల్, అశ్విని, సౌమ్య, మధు, ప్రవీణ్ తదితరులు

హైదరాబాద్,జనవరి 21,ప్రభాతవార్త:
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను బుధవారం రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు దినేష్ పాటిల్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం కలిసి 25న కోకాపేట్‌లో జరిగే నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం, సర్పంచ్‌లకు సన్మానం కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈసందర్భంగా గతప్రభుత్వ హయాలో కెసిఆర్ తమ సంఘానికి ఒక ఎకరం పది కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు దినేష్ పాటిల్‌తోపాటు మహిళా ప్రధాన కార్యదర్శి మార్గపు అశ్విని, ట్రెజరర్ కందాడ సౌమ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మధు , ఉపాధ్యక్షులు క్రాంతి వాలే శెట్టి, రాష్ట్ర యువజన కన్వీనర్ దూది ప్రవీణ్, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జ్ కొట్టే మహేష్ సభ్యులు సాత్విక్ తదితరులు పాల్గొన్నారు

ఎంపీ నిధులతో బోర్‌వెల్...

బోర్ వెల్ పనులను పర్యవేక్షిస్తున్న అడిక్ మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు పాశం సాయి కృష్ణ యాదవ్

చిక్కడపల్లి జనవరి 21 (ప్రభాతవార్త) :
కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చొరవతో ఎస్ ఆర్ టి క్వాటర్స్ సత్య నగర్ కాలనీవాసులు గత కొన్ని ఏళ్లుగా నీటి కొరత పరిష్కారమైందని అడిక్ మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు పాశం సాయి కృష్ణ యాదవ్ అన్నారు. ఇటీవల తాను కాలనీవాసులు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దృష్టికి నీటి కొరత సమస్యను తీసుకెళ్లడం జరిగిందని, వెంటనే స్పందించిన మంత్రి బోర్వెల్ కు తగిన నిధులు ఇస్తానని వెంటనే పనులు చేపట్టాలని సూచించడం జరిగిందని అన్నారు. ఫలితంగా కేంద్ర మంత్రి సహకారంతో సత్య నగర్ కాలనీలో బుధవారం బోర్ వెల్ పనులు చేపట్టారు. తమకు సహాయ సహకారాలు అందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ కు పాశం సాయి కృష్ణ యాదవ్ కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులని తొలగించే చర్యలు ఉపసంహరించుకోవాలి : రాధాకృష్ణ



పార్లమెంట్ కమిటీ చైర్మన్ బసవరాజ్ బొమ్మైకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న అఖిల భారతీయ కాంట్రాక్ట్ లేబర్ ఫెడరేషన్ ప్రబారి కెవి రాధాకృష్ణ

చిక్కడపల్లి జనవరి 21 ప్రభాతవార్త : సెంట్రల్ యూనివర్సిటీ ఔట్సోర్సింగ్ కార్మికులని యూనివర్సిటీ యజమాన్యం తొలగించే ప్రయత్నాన్ని ఉపసంహరించుకోవాలని అఖిల భారతీయ కాంట్రాక్ట్ లేబర్ ఫెడరేషన్ ప్రబారి కెవి రాధాకృష్ణ డిమాండ్ చేసారు. బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో భారతీయ మజ్దూర్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కెవి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రధానంగా సెంట్రల్ యూనివర్సిటీ ఔట్సోర్సింగ్ కార్మికులని యూనివర్సిటీ యజమాన్యం తొలగించే ప్రయత్నం చేస్తున్నారని వర్సిటీలో పెర్మనెంట్ కార్మికుల్ని రిటైర్మెంట్ అయిన తర్వాత తిరిగి ఉద్యోగాలకు తీసుకోవడం కోసం ప్రస్తుతం ఉన్న ఔట్సోర్సింగ్ కార్మికులని తొలగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. వర్సిటీ యాజమాన్యం సానుకూలంగా స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ జితేందర్ మాట్లాడుతూ యజమాన్యం ఈపీఎఫ్ లో అనేక అవకతవకలు ఉన్నాయని, సరి చేయమని యజమాని అని అడిగితే అమర్యాదగా మాట్లాడుతున్నారన్నారు. కాంట్రాక్టర్ తో మాట్లాడదామంటే అందుబాటులో ఉండే పరిస్థితి లేదన్నారు. ఈ

ప్రతి కార్యకర్తకు అండగా బిఆర్ఎస్

గాయిత్రినగర్ చంద్రా గార్డెన్‌లో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

యూసుఫ్‌గూడ జనవరి 21, ప్రభాతవార్త : ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి తగిన విధంగా కృషి చేయటం జరుగుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ చంద్రా గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో ప్రతి కార్యకర్త చురుకైన కార్యకర్తగా పనిచేస్తారని తెలిపారు. ప్రస్తుతం ఉన్న డివిజన్ల కంటే అదనంగా డివిజన్లను మార్చటం జరిగిందని రాబోయే రోజుల్లో ప్రస్తుత కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండీ గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల అయలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, పిల్లి తిరుపతి, జాహేద్ షరీఫ్, జ్ఞానేశ్వర్, పార్వతమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ దేవి ఆలయంలో వసంత పంచమి వేడుకలు

మూసాపేట్, జనవరి 21, ప్రభాతవార్త

కూకట్‌పల్లి, సంగీత్ నగర్‌లోని శ్రీ నల్ల పోచమ్మ దేవి ఆలయంలో ఈ నెల 23వ తేదీన శ్రీ వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొమ్ము సత్తయ్య, ఆలయ పూజారి రంగం శ్రవణ్ కుమార్‌లు బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. శ్రీ వసంత పంచమిని పురస్కరించుకుని అమ్మవా రికి ఈ నెల 23వ తేదీన ఉదయం 5:30గంటలకు పంచామృత అభిషేకం, 8:30గంటలకు ప్రత్యేక అలంకరణ, 9గంటల నుండి మహిళలచే లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుండి మహా అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగాలరని కోరారు.

శివ సాయి దేవాలయం నిర్మాణానికి లక్ష విరాళం

దుండిగల్, జనవరి 21, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాగిల్లపూర్‌లోని శ్రీ శివ సాయి దేవాలయం యొక్క నిర్మాణానికై బుధవారం ఆలయ కమిటీ సభ్యులు బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డిని కలువగా వారు స్పందించి ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను నిరంతరం కాపాడుకోవాలని, దేవాలయాల అభివృద్ధిలో నా వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాండు, కుమార్, శ్రీను, నర్సింహా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట, జనవరి 21, ప్రభాతవార్త

126 జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్టపై కొలువున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 55వ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి నుంచి మూడు రోజుల పాటు అద్వితీయంగా నిర్వహించే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయడంతో పాటు స్వామివారి కృపాకటాక్షాలు పొందాలన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల బ్రహ్మోత్సవాలలో భాగంగా 23న నిర్వహించనున్న శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, దేవాలయ కమిటీ డైరెక్టర్లు వేణు గౌడ్, రవీందర్, సంజీవ్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రాజు, మహిళా నాయకురాలు ఇందిరాగౌడ్, సీనియర్ నాయకులు విఠల్, దాసు, మల్లేష్ గౌడ్, జైహింద్, రాజు, పాపులు గౌడ్, అంజయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చిత్తారమ్మ దేవి జాతర వేడుకలు

సూరారం, జనవరి 21, ప్రభాతవార్త : భక్తుల కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా వెలసిన చిత్తారమ్మ దేవి జాతర వేడుకలు ఈ నెల 23 నుండి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 25న ఆదివారం మహా జాతరలో వేలాది మంది భక్తులు తరలి రానుండడంతో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశామని, పోలీస్ శాఖతోపాటు జిహెచ్ఎంసి అధికారులు ఈ జాతరలో పాల్గొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపడుతున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దాతలు

నిజాంపేట్, జనవరి 21, ప్రభాతవార్త : హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం దాత కొమరవోలు చిద్విలాస్ సహకారంతో ఎంబిబిఎస్ చదువుతున్న విద్యార్థిని బనావత్ జయశ్రీకి రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమరవోలు చిత్విలాస్ (తండ్రి కొమరోలు కాంతారావు జ్ఞాపకార్థంగా) ఒక పేద వైద్య విద్యార్థినికి ఆర్థిక సాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తొర్రూర్ మండలం, మహబూబాబాద్ జిల్లాకు చెందిన బనావత్ నెహ్రూ, విజయాల కుమార్తె బనావత్ జయశ్రీ ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీలో చదివి నీటిలో 374 మార్కులు సాధించి, మహావీర మెడికల్ కాలేజ్, వికారాబాద్ సీటు సాధించిందన్నారు. తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ కుమార్తె ఉన్నత చదువుల చదివించ డానికి ఇబ్బంది పడుతున్న కుటుంబానికి ఆసరాగా నిలబడి దాత కొమరవోలు చిద్విలాస్ సహకారంతో రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, శంకర్ గోవింద్, వెంకన్న, భాస్కర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే

-మొక్కలను పసికందుల తరహాలో సంరక్షించాలి
- ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

అత్తాపూర్ జనవరి21,ప్రభాతవార్త : రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ కళాశాలలో బుధవారం గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..విద్యార్థులు నాటిన మొక్కలను ఒక చిన్న బిడ్డల సంరక్షించాలని సూచించారు. మొక్కలను ప్రేమతో పెంచితే అవి భవిష్యత్తులో సమాజానికి ఆక్సిజన్ తో పాటు ఆశను కూడా అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు నాటిన మొక్కలను నాలుగు సంవత్సరాల పాటు సంరక్షిస్తే పట్టభద్రులు అయ్యే సమయంలో ఆ మొక్కతో పాటు విద్యార్థి ఫోటోను గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ తో పొందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వి.ఎస్.ఎన్.వి ప్రసాద్,ఐ ఎఫ్ ఎస్(డైరెక్టర్, హెచ్ఎండి ఎ) మరియు శ్రీనివాస్,ఐఎఫ్ ఎస్(ఎన్ఐపిహెచ్ఎం) ముఖ్య అతిథులుగా విచ్చేశారు. గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే ద్వారా పర్యావరణహిత జీవన విధానాలు, పచ్చదనం పెంపొందించడం, వనరుల సుస్థిర వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సి హెచ్ విద్యాసాగర్, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్ పాల్గొని ఉపకులపతి మరియు ముఖ్య అతిథులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా బీఎస్సీ ఏజీ మొదటి సంవత్సర విద్యార్థులు సుమారు 500 మొక్కలను నాటారు. ఈ భారీ స్థాయిలో జరిగిన మొక్కలు నాటడం ద్వారా క్యాంపస్ ను హరితమయం చేయడమే కాకుండా, పర్యావరణ సంరక్షణపై విద్యార్థుల్లో దీర్ఘకాలిక అవగాహన కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని మొక్కలు నాటడం, విద్యార్థులను సమన్వయపరచడం మరియు కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది,ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మరియు 500 మంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హీరో మోటార్ కార్ప్ మేనేజర్ సాదిక్‌సాగర్.

బేగంపేట జనవరి 21,ప్రభాతవార్త రోడ్డు బద్రత నియమాలు పాటించాలని,రోడ్డు బద్రత తో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విధ్యార్థులకు ట్రాఫిక్ పోలీసులు,హీరో కార్ప్ ఆధ్వర్యంలో బేగంపేట లోని పాఠశాలల్లో విధ్యార్థులకు అవగాహన కల్పించారు.బుధవారం రోడ్డు బద్రతా వారోత్సవాలలో భాగంగా బేగంపేట ట్రాఫిక్ పోలీసులు,హీరో కార్ప్ ఆధ్వర్యంలో పాటిగడ్డ ప్రభుత్వ పాఠశాలతో పాటు శ్యాంలాల్ బిల్డింగ్ డాన్‌బర్స్ హైస్కూలు విధ్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విధ్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించడంతో పాటు రోడ్డు సేఫ్టీ ర్యాలీ నిర్వహించారు.రోడ్డు సేఫ్టీపై క్విజ్ నిర్వహించారు.రోడ్డు బద్రత విషయంలో విధ్యార్థులకు కొన్ని సూచనలు చేసారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అశోక్‌రెడ్డి,పాటిగడ్డ ప్రభుత్వ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు బీసీఎస్ శర్మ, ఫిజికల్ డైరక్టర్ వేణుగోపాల్, హీరో మోటార్ కార్ప్ రోడ్డు సేఫ్టీ మేనేజర్ సాదిక్ సాగర్,సేఫ్టీ ఇన్స్ట్రక్టర్ ప్రవీణ్ పున్నా 300మంది విధ్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన అవసరం: కార్పొరేటర్

డ్రైనేజీ లేకేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్

అల్వాల్, జనవరి 21 ప్రభాతవార్త: డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన అత్యవసరమని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని దేవుని అల్వాల్ జగన్నాధ ఆలయం వద్ద రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీటిని పరిశీలించారు. సమస్య పరిష్కారానికి శాస్వత పరిష్కారం అసవరమని జలమండలి అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి ఉంటుందని శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారి క్రిష్ణమాచారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా వైద్య శిబిరం

పేట్ బషీరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త

శివ శివాని ఇన్స్టిట్యూట్ అఫ్ మానేజ్మెంట్‌లో బుధవారం ఐబీఎం, ఐసిఎంఎఐ ఎంఓయు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఐఎస్ఏ ఎక్స్పర్ట్ లాబ్స్, ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డేటా, ఏఐ సర్వీసెస్ లీడర్ అండ్ కంట్రీ మేనేజర్ జగదీష భట్, బిఎఫ్ ఎస్సై బోర్డు చైర్మన్, ఐసిఎంఎఐ సీఎంఏ చిత్తరాంజన్ చట్టపాధ్యాయలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందుతున్న అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన అడ్వాన్స్‌డ్ సర్టిఫికేట్ ఇన్ ఫిన్‌టెక్‌ను అందించడానికి ఐసిఎంఎఐ, స్సిమ్ తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అనంతరం లయన్ ప్రవీణ్ మర్రి, శైలజ మర్రి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ ఎలైట్ సంజీవని బ్లడ్ క్యాంప్ సంయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డా. కె సిహెచ్ ఏవిఎస్ ఎన్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్ అండ్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి, వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, ఇంచార్జి డైరెక్టర్ డా. ఎన్ ఆర్‌కేఎస్ చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైను పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

పైపులైను ప్రారంభోత్సవ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

జూబ్లీహిల్స్, జనవరి 21, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంకటగిరిలో నూతన తాగునీటి పైపులైను పనులను జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 35 లక్షల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించడమే తమ లక్ష్య మని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంజయ్‌గౌడ్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి,నేతలు భవానీ శంకర్, మల్లికార్జున్,నాగార్జున్‌రెడ్డి,జలమండలిఅధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో నూతన రథం ప్రత్యేక పూజలు

కంటోన్మెంట్,జనవరి 21 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు న్యూ సిటీ కాలనీలో ప్రసిద్ధిగాంచిన శ్రీవెంకటేశ్వర దేవాలయంలో జరిగిన బ్రహ్మోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. సుమంత్ రెడ్డి దంపతుల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి నూతన రథం ప్రత్యేక పూజల్లో వారు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు నారాయణ, లక్ష్మణ్,యాదయ్య, సాంబశివరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై నియోజకవర్గ నాయకులతో సమావేశం

జూబ్లీహిల్స్, జనవరి 21, ప్రభాతవార్త: బీఎల్ఏ లిస్ట్, ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులతో బుధవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శంకర్‌నాయక్ అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు చర్చించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి వినోద్‌కుమార్, బీజేపీ నాయకురాలు సుప్రియ గౌడ్, ఎంఐఎం నుంచి నజీర్, ఐఎన్‌సీ నుంచి కృష్ణకుమార్, మణికుమార్, బీఎస్పీ నుంచి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నుంచి సయ్యద్ నయీమ్ పాల్గొన్నారు.

చాంద్రాయగుట్ట దేవి దేవాలయం బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, జనవరి 21, ప్రభాతవార్త :

సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

పాతబస్తీ చాంద్రాయణగుట్ట శ్రీ దేవి దేవాలయం 161వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమైయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా తొలి రోజున ఆలయ ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ ఆధ్వర్యంలో వేద పండితులు, మంగళ వాయిద్యాల మధ్య ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, మండప, గణపతి, నవగ్రహ పూజ, గణపతి, నవగ్రహ హోమం, ఛండీ యజ్ఞ పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు మాతృమూర్తులచే సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఒంటి గంటకు మహా హారతి జరిగింది. అనంతరం వి.కిశోర్ కుటుంబ సభ్యులచే భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి జరిగిన మహా హారతికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని వివిధ రకాల పువ్వులు, మామిడి, అరటి, కొబ్బరి ఆకులు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ పూజా కార్యక్రమాలలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల రెండవ రోజు, 22వ తేదీ గురువారం అమ్మవారికి అభిషేకం, చండీ యజ్ఞం, కుంకుమార్చన, హారతి, అన్నప్రసాదం, సాయంత్రం హారతి, ప్రసాద పంపిణీ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీమాత అనుగ్రహానికి పాత్రులు కాగలరని ప్రధాన అర్చకులు ప్రమోద్ కుమార్ కార్వాంకర్ కోరారు.

ప్రత్యేక కేసుల్లో ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

దుండిగల్, జనవరి 21, ప్రభాతవార్త

ఫిర్యాదు స్వీకరిస్తున్న దృశ్యం

కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండానే.. వారి ఇంటికే వెళ్లి కేసు నమోదు చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. తీవ్రమైన నేరం బారిన పడినప్పుడు బాధితులు మానసిక ఒత్తిడికి లోనయ్యే అవకాశమున్న దృష్ట్యా ఈ సౌలభ్యం కల్పించబోతోంది. బుధవారం దుండిగల్ ఇన్ స్పెక్టర్ పి. సతీష్ తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాగిళ్ళపూర్, గ్రీన్ వుడ్స్ విల్లాలో మంగళవారం రాత్రి దొంగతనం జరిగిందని ఫిర్యాదిదారుడు తుమ్మ లపల్లి నాగేందర్ కృష్ణ చైతన్య పోలీసులకు సమాచారం అందించారు. తను కుటుంబ సమేతంగా సంక్రాంతి పండుగకి విజయవాడ వెళ్లి తిరిగి మంగళవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తన ఇంటి వెనుక డోర్ పగులగొట్టి ఉంది. బీరువా లాకరు తెరిచి ఉంది. బీరువాలో చెక్, రెండు కేజీల వెండి, 10 గ్రాముల బంగారం, రూ. 5 వేల నగదు చోరీ జరిగిందని గుర్తించి డయల్ 100లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే దుండిగల్ డీఐ ఎం. బాల్ రెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఫిర్యాదుదారుని ఇంటి వద్దే ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని ఫిర్యదీదారుడుకి ఎస్ఐ రామ్మోహన్ అందజేశారు. తాను సొత్తు పోయిందన్న బాధలో ఉన్నప్పటికీ పోలీసులు సకాలంలో స్పందించి ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం పట్ల ఫిర్యాదుదారుడు హర్షం వ్యక్తం చేశారు.

మాపాట్ట కొట్టొద్దు ..టర్న్‌కీవ్యవస్థను కాపాడండి

డైరెక్టర్ చక్రపాణికి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వినతి

డైరెక్టర్ చక్రపాణికి వినతిపత్రం ఇస్తున్న ప్రెసిడెంట్ కందుకూరి శ్రీనివాస్ వివిధ జిల్లాల కాంట్రాక్టర్లు

హైదరాబాద్, జనవరి 21,ప్రభాతవార్త: ఏళ్లుగా విద్యుత్‌శాఖపై ఆధారపడి ఉన్న కాంట్రాక్టర్ల కుటుంబాల పొట్టకొట్టొద్దని.. డిపార్ట్‌మెంటే పనులు చేసేవిధంగా అమలు చేయబోతున్న కొత్తపద్ధతిపై ఉన్నతాధికారులు పునః సమీక్షించి టర్న్‌కీ (నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్ట్) వ్యవస్థ ను కాపాడాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ టిజిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ చక్రపాణిని కోరింది. ఈమేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలోని ప్రతినిధిబృందం మింట్‌కాంపౌండ్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా కందుకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏళ్లుగా నడుస్తున్న ఈవ్యవస్థలో మార్పులు చేర్పులు వస్తున్నాయని తెలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్స్ అందరిలో గందరగోళ వాతావరణం నెలకొందన్నారు. కావున దీనిపై సిఎండీ, డైరెక్టర్లు అందరు పున:సమీక్ష చేసి అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలోరాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు నివారణకు పౌరుల సహకారం అవసరం : ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్

అల్వాల్, జనవరి 21 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాలు నివారణలో బాగంగా అరైవ్ అలైవ్ భద్రత అవగాహన కార్యక్రమాన్ని పోలీసు విభాగం గత వారం రోజులుగా నిర్వహిస్తోంది. బుధవారం అల్వాల్ పోలీసు స్టేషన్ శాంతి భద్రతలు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్యలు అరైవ్ అలైవ్ భద్రత అవగాహనకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను వివరించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, హెల్మెట్ ధరించడం తదితర విషయాలుపై గతంలో జరిగిన పరిణామాలు నేడు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి సిఐ శంకరయ్య వివరించారు. ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించాలనే ప్రభుత్వ నిశ్చయంతో పోలీసు శాఖకు చెందిన అన్ని విభాగాలు అవగాహన కార్యక్రమంలో బాగస్వామ్యం అవుతున్నాయని తెలిపారు. పోలీసు యంత్రాంగానికి పౌరులు సహకరించాలని ఆయన కోరారు.

24,25 తేదీల్లో "చిన్మయ మిషన్ అమృత మహోత్సవం"

ఎన్టీఆర్ స్టేడియంలో రెండురోజులపాటు నిర్వాహణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వామి సర్వేశానంద, హరీష్‌కుమార్ తదితరులు

హైదరాబాద్,జనవరి 21,ప్రభాతవార్త: ఆధ్యాత్మిక, విద్యా, సామాజిక సేవా రంగాలలో 75 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని "చిన్మయ మిషన్ అమృత మహోత్సవం"ను ఈనెల 24, 25, తేదీల్లో హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో రెండు రోజుల నిర్వహించనున్నట్లు ఇంచార్జ్ స్వామి సర్వేశానంద, సిఎంజిహెచ్ అధ్యక్షులు హరీష్ కుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పూజ్య గురుదేవ స్వామి చిన్మయానందజీ పావన జీవితాన్ని, దూరదర్శి దృష్టిని, అలాగే ప్రపంచవ్యాప్తంగా చిన్మయ మిషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను స్మరించుకునే ఈ మహోత్సవానికి భక్తులు, విద్యార్థులు, యువత, సాధారణ ప్రజానీకం అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. చిన్మయ మిషన్ హైదరాబాద్ గత అనేక దశాబ్దాలుగా ద్వితీయ నగరాల పరిసరాల్లో ఆధ్యాత్మిక అధ్యయనం, సాంస్కృతిక పునరుజ్జీవనం, సమాజ సేవకు కేంద్రబిందువుగా నిలుస్తోందన్నారు. భగవద్గీత, ఉపనిషత్తులపై నియమిత తరగతులు, భజనలు, సత్సంగాలు, శిబిరాల ద్వారా వేదాంతాన్ని ఆధునిక జీవన విధానానికి అన్వయించగలిగే విధంగా బోధిస్తోందని బాలవిహార్, యువకేంద్రం, కుటుంబ కార్యక్రమాలు, పాఠశాలలు-విద్యాసంస్థలతో కలిసి జరుగుతున్న అవగాహన, సేవా కార్యక్రమాల ద్వారా వేలాది పిల్లలు, యువత, కుటుంబాలలో విలువలు, వ్యక్తిత్వ వ

వసంత పంచమి పేరుతో వింత అడ్మిషన్లు

-ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్

తుర్కయంజాల్ జనవరి 21,ప్రభాతవార్త

వసంత పంచమి పేరుతో ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన కార్పొరేట్ స్కూల్‌లపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఎడి) పూర్ణచంద్ర రావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ... అకాడమిక్ సంవత్సరం ప్రారంభం కాకముందే వసంత పంచమి పేరుతో ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన కార్పొరేటర్ స్కూళ్లను వెంటనే సీజ్ చేయాలని అన్నారు. డబ్బులే ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్న కార్పొరేట్ స్కూల్ ఇలా వింత పేర్లతో, భారీ డిస్కౌంటు అంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నారనీ తెలిపారు. వసంత పంచమి పేరుతో జరిగే అక్రమ అడ్మిషన్లను అడ్డుకోకపోతే అఖిల భారత యువజన సమైక్య పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు హరిక్రిష్ణ నాయక్, గండికోట శివ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

జెజె నగర్‌లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

నేరేడ్‌మెట్, జనవరి 21,ప్రభాతవార్త :

డివిజన్ సమగ్రభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని జె.జె.నగర్ రోడ్ నం.6లో కార్పొరేటర్ నిధులతో మంజూరైన రూ.18 లక్షల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. 136వ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి పార్టీ నాయకులు, కాలనీ వాసులతో కలిసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గత జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో కార్పొరేటర్ నిధుల కింద మంజూరైన నిధులతోనే ఈ రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు. దీర్ఘకాలంగా రోడ్డు సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జె.జె.నగర్ వాసులకు ఈ సీసీ రోడ్డు పూర్తయితే రాకపోకలు సులభమవుతాయని, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత : నారాయణరెడ్డి

ఈస్ట్ జోన్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి ని సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, జనవరి 21, ప్రభాతవార్త:

ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకురుతుందని ఈస్ట్ జోన్ పిస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేటలోని శ్రీ పోచమ్మ దేవాలయంను సందర్శించి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు ఆయనకు పుష్పగుచ్చలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం పంపి సలహాదారుడు వేమూరి విజయకుమార్, తాటికొండ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం

మల్కాజిగిరి జనవరి.21.ప్రభాతవార్త

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బి జె ఆర్ నగర్ లో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కమ్యూనిటీ హాల్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలపడం జరిగింది అలాగే డ్రైనేజీ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏ ఈ దివ్యజ్యోతి,వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్,రంగమ్మ, డప్పు సాయి, సలీం, అక్తర్, సంతోష్, రాజు,నాగరాజు, నరేష్, సాయి సుందర్,బాబు రావు, విష్ణు, నర్సింగ్ రావు, శ్రీనివాస్,నవీన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు, సత్యనారాయణ, కిషోర్,అశోక్, తదితరులు పాల్గొన్నారు

కనీస మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

హయత్ నగర్, జనవరి 21 ప్రభాతవార్త: డివిజన్ లోని ప్రతి ఇంటికి కనీస సదుపాయలను కల్పించడమే లక్ష్యంగా పనిచేశానని మన్సురాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. డివిజన్ పరిధి హయత్ నగర్ ప్రాంతంలోని శ్రీ గాయత్రి నగర్ కాలనీలో 47.20 లక్షల వ్యయంతో పూర్తి చేసిన భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్, 11.50 లక్షల ఇంటర్నల్ లైన్లు, సొంత నిధులతో నిర్మించుకున్న కాలనీ సంక్షేమ సంఘ భవనాన్ని ఆయన బుధవారం కాలనీ సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి ప్రారంభించారు. తన వంతు సహాయంగా 15 వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ.. తమ సొంత నిధులతో సంక్షేమ భవనాన్ని నిర్మించుకోవడం హర్షనీయ మన్నారు. కొంతమంది నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అభివృద్ధితో వారికి సమాధానం చెబుతానన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా నిరంతరం డివిజన్ అభివృద్ధి కోసం పోరాడుతున్నానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రాజుయాదవ్, జయతే జ చౌదరి, బాలకృష్ణ,అర్లయ్య,సత్య నారాయణ,అంజి పాల్గొన్నారు.

హైకోర్టు కాలనీ ముఖద్వారం ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం. జనవరి.21.ప్రభాతవార్త

హయత్ నగర్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవాలయం హైకోర్టు కాలనీ నూతన ప్రవేశ ముఖ ద్వారం నక్క రఘునందన్ యాదవ్ జ్ఞాపకార్థం వారి సతీమణి నక్క పుణ్యవతి సహకారంతో నిర్మించిన ముఖ ద్వారాన్ని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... ఆర్చి నిర్మాణం కోసం సహాయ సహకారాలు అందించిన నక్క కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. గతంలో చిన్నపాటి వర్షానికి ఇట్టి కాలనీ జలమయం అయ్యేది అని దానికి ప్రత్యామ్నాయంగా బాక్స్ డ్రైన్స్ నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే కాలనీల అన్ని రోడ్ల నందు డ్రైన్స్, రోడ్లు,మంచినీటి సౌకర్యాలు కల్పించడం జరిగింది అని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి మంచినీరు అందించడం జరుగుతుంది అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,మహిళా అధ్యక్షురాలు అంజలి,తూర్పు కాలనీల అధ్యక్షులు దీపావళి శ్రావణ్ కుమార్,భాస్కర్ సాగర్,మల్లేశ్ ముదిరాజ్,గుత్తా లక్ష్మణ్ రెడ్డి,గుజ్జ జగన్ మోహన్,దీపావళి శ్రీకాంత్,ప్రదీప్, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్,ఉపాదక్షులు మోహన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్,కార్యనిర్వాహక కార్యదర్శి మురళి కృష్ణరాజు,నక్క వెంకట్ స్వామి,నక్క వంశీకృష్ణ యాదవ్,నక్క ప్రసాద్ బాబు యాదవ్,నక్క ప్రవీణ్ కుమార్ యాదవ్,నక్క శ్రావణ్ కుమార్ యాదవ్,దేవాలయం ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ ముఖద్వారంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

తుర్కయంజాల్ జనవరి 21,ప్రభాతవార్త

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారులు వెం నరేందర్ రెడ్డికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగే విష్ణువర్ధన్ రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ కరింగుల నరేందర్ గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల పోరం అధ్యక్షులు కొంతం యాదిరెడ్డిలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అమరవీరుల బలిదానాలతో తెలంగాణ ఉద్యమకారుల పోరాటాలు, ఎన్నో త్యాగాల తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలు కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారు లను పూర్తిగా విస్మరించింది. కావున కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు 250 గజాల స్థలం, ఉద్యమకారులకు 25000 పెన్షన్ మరియు 10వేల కోట్లతో సంక్షేమ బోర్డు ఇంకా ఒక గుర్తింపు కార్డు హామిలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి ఇప్పించగలరని వేం నరేందర్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కారింగుల నరేందర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు నక్క జంగయ్య గౌడ్, పెద్ద అంబర్పేట్ మున్సిపల్ అధ్యక్షులు జోర్కారాం ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.69లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు : రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్, జనవరి 21 ప్రభాతవార్త :

ఉప్పల్ డివిజన్ స్వరూప్‌నగర్‌లో రూ.69 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టినట్లు స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ స్వరూప్ నగర్‌లో డ్రైనేజీ పనులను కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో దశలవారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే సిసి రోడ్లు పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సత్యనారాయణ, స్వరూప్‌నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ఆనంద్ ప్రభు, పిసాటి అంజిరెడ్డి, హనుమంత్, నాగేందర్, జ్ఞానేశ్వర్, లూకాస్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, అమర్, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, హనుమాన్, వెంకటేష్, రమేష్ ,సురేష్ పాల్గొన్నారు.

ఉప్పల్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

బాలాపూర్‌లో ధర్మరక్షణ సభకు హైకోర్టు అనుమతి

-సభ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టిన నిర్వాహకులు

సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త: హైదరాబాద్/రంగారెడ్డి పరిధిలోని బాలాపూర్ పరిసర ప్రాంతంలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలను వెనక్కి పంపాలనే డిమాండ్‌తో జాగో భాగ్యనగర్.. ఛలో బాలాపూర్ నినాదంతో గణేష్ సేన ఆధ్వర్యంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ శనివారం మధ్యాహ్నం స్థానిక గణేష్ చౌక్ సమీపంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ధర్మ రక్షణ సభకు హైకోర్టు అనుమతినిచ్చింది. సభకు పోలీసులు అనుమతి నిరాకరించిన నేపథ్యంలో గణేష్ ఉత్సవ సమితి వారు హైకోర్టును ఆశ్రయించారు. అయితే బుధవారం విచారణ జరిపిన హైకోర్టు కొన్ని ఆంక్షలతో కూడిన అనుమతినిచ్చింది. సభకు బందోబస్తు కల్పించాలని పోలీసు శాఖకు అదే విధంగా పారిశుధ్యం తదితర వసతులు కల్పించాలని జిహెచ్ఎంసికి సూచనలు చేసింది.

అఖిలపక్షం తరపున హర్షం వ్యక్తం చేసిన శంకర్‌రెడ్డి

ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ధర్మ రక్షణ సభకు అడ్డంకులు తొలగి అనుమతి లభించడంతో సింగిల్ విండో మాజీ ఛైర్మన్, బాలాపూర్ అఖిల పక్ష బృంద సభ్యుడు కొలను శంకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అయితే సభ విజయవంతం కోసం నేడు గురువారం సాయంత్రం 4 గంటలకు బాలాపూర్‌లోని హనుమాన్ దేవాలయం నుండి గణేష్ సేన ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు, కుల సంఘాల వారు, హిందూ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సభ ఏర్పాట్లకు భూమి పూజ చేస్తున్న బాలాపూర్ అఖిల పక్ష నాయకులు, గణేష్ సేన, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు

నాదర్‌గుల్‌లో ప్రభుత్వ భూమి కబ్జా యత్నాలపై ఆర్‌డిఓకు ఫిర్యాదు

-విచారణకు వచ్చిన అధికారులు.. కబ్జాయత్నాలను వివరించిన గ్రామస్తులు

సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త: బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 1,2,3,4,5, 26లలోనున్న 7.05 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జాకు ప్రయత్నిస్తున్నారనీ ఈ నేపథ్యంలో దానిని కాపాడాలని కోరుతూ గత సోమవారం కందుకూరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్‌డిఓ)కు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు/వినతి పత్రంపై స్పందించిన అధికారులు సదరు భూమిని పరిశీలించారు. వక్ఫ్ బోర్డు ఆర్ఐ ఖమర్, విలేజ్ రెవెన్యూ జిపిఎ మల్లిఖార్జున్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి తదితరులు వారికి ప్రభుత్వ భూమి కబ్జాకు జరుగుతున్న యత్నాలను వివరించారు. ఇక్కడి ప్రభుత్వ భూమి తమ దేననీ తమ వద్ద ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని చెబుతూ కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్రమణలకు ప్రయత్నిస్తున్నారని వారు వివరించారు. అయితే స్థానిక ప్రజలు ఆక్రమణలను ప్రతిఘటించారని వారు వెల్లడించారు. గతంలో ప్రభుత్వ భూమిలోనే బడంగ్‌పేట్ మున్సిపాలిటీ వారు హరిత హారం మొక్కలను నాటగా వాటిని తొలగించి ఆక్రమణదారులు ప్రహరీగోడను నిర్మించారని వారు తెలిపారు. ప్రభుత్వ భూమిని సమగ్రంగా పరిశీలించి పహాణీ రికార్డులు పరిశీలించి ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు గ్రామ ప్రజల తరపున కోరారు. ఈ కార్యక్రమంలో కోటగిరి జంగయ్య, ముద్దం జనార్ధన్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూమి పరిశీలనకు వచ్చిన అధికారులకు వివరిస్తున్న నాదర్‌గుల్ మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి

అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా ప్రచారంపై మీడియా ప్రతినిధులకు అవగాహన

మేడిపల్లి, జనవరి 21 ప్రభాతవార్త ;

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం-2026 భాగంగా, మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమం 6వ రోజు మీడియా ప్రతినిధులతో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా "అరైవ్ అలైవ్ " నినాదంతో జనవరి 13 నుంచి 27 వరకు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా 6వ రోజు మేడిపల్లి పోలీస్ స్టేషన్లో సిఐ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మేడిపల్లి మండల మీడియా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకమైనదని, ప్రతివారు రక్షణ కవచంగా ఉండే హెల్మెట్ ను ధరించాలని హెల్మెట్ ధరించడం వల్ల వారి ప్రాణాలకే కాకుండా కుటుంబ సభ్యులను కూడా కాపాడిన వారమైతామని, వాహన దారులకు రోడ్డు నిబంధనలను పాటిస్తూ హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని, ప్రజలలో మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీడియా ప్రతినిధులదని సిఐ గోవిందరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, కృష్ణయ్య గౌడ్ ,నర్సింగ్ రావు యాదవ్, తిరుపతి ,వీరబాబు మేడిపల్లి మండల పరిధిలోని మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి. ఎస్ఐలు కృష్ణయ్య గౌడ్ ,నర్సింగ్ రావు యాదవ్ ,తిరుపతి, వీరబాబు తదితరులు

బాలాపూర్ ధర్మ రక్షణ సభకు ఆర్యవైశ్యుల మద్దతు

సరూర్‌నగర్, జనవరి 21 ప్రభాతవార్త:

బాలాపూర్ గణేష్ చౌక్ సమీపంలో ఈ నెల 24వ తేదీ శనివారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సహకారంతో గణేష్ సేన ఆధ్వర్యంలో జరిగే ధర్మ రక్షణ సభకు బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం మద్దతు తెలిపింది. సంఘం అధ్యక్షుడు నాళ్ళ శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ సంఘం క్యాలెండర్ తో పాటు ధర్మ రక్షణ సభ కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాళ్ళ శ్రీనివాస్‌గుప్త తదితరులు మాట్లాడుతూ జాగో భాగ్యనగర్.. ఛలో బాలాపూర్ నినాదంతో ధర్మ రక్షణ పేరిట జరుపుతున్న ఈ సభలో ఆర్యవైశ్యులు పాల్గొని విజయవంతానికి సహకరిస్తారని స్పష్టం చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ, ధర్మ రక్షణ సభ కరపత్రాల పంపిణీ సభలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి : కార్పొరేటర్

సిసి రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 21 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ శ్రీనివాస కాలనీలో రూ.12.27లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డుకు, సుబ్రమణ్యం నగర్‌లో రూ.15.29లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డుకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాస కాలనీవాసులు నర్సింహారెడ్డి, మాధవరెడ్డి, శ్రీనివాస్, అనిల్ కుమార్, రాజేశ్వర్, విజయ్, సుబ్రమణ్యం నగర్ కాలనీవాసులు ప్రసాదరావు, మాధవరావు, సత్యమూర్తి, శ్రీనివాస్, శేషగిరిరావు, సత్యనారాయణరాజు, రాజ్యలక్ష్మి, బాలత్రిపుర సుందరి తదితరులు పాల్గొన్నారు.

పూసలబస్తీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ పర్యటన

బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, జనవరి 21 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ పూసలబస్తీలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. బస్తీలోని రోడ్లపై గుంతలు ఉండడం వల్ల నీరు నిల్వ ఉంటుందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అసరమైన చోట నూతనంగా వీది దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బిజెఆర్ భవన్ మరమ్మతులకు రూ.3 కోట్లు విడుదల చేయాలి : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బిజెఆర్ భవన్‌లో మరమ్మత్తు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

హుడాకాంప్లెక్స్, జనవరి 21 ప్రభాతవార్త: గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బాబు జగ్జీవన్‌రామ్ భవనం మరమ్మతు పనులకు మంజూరయిన రూ.3 కోట్లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కొత్తపేటలోని బిజెఆర్ భవనాన్ని పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బిజెఆర్ భవనంలో చాలా మరమ్మత్తు పనులు చేపట్టాల్సి ఉందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.3 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మొదటి అంతస్తులో వంటగది ఏర్పాటు చేస్తే పేదలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, లోకసాని కొండల్‌రెడ్డి, పెండ్యాల నగేష్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, సాజిద్, రాం నర్సింహాగౌడ్, అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి

టాస్ వేస్తున్న మాజీ ఎంపీ బురనర్సయ్య గౌడ్.

హయత్ నగర్, జనవరి 21 ప్రభాతవార్త :

ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవాలలో భాగంగా పెద్ద అంబర్ పేట్ డివిజన్ పరిధిలోని కుంట్లూర్ బీఆర్ఆర్ క్రికెట్ గ్రౌండ్స్ లో ఆదివారం క్రికెట్ టోర్నమెంటును కోఆర్డినేటర్ గంగిడి మనోహర్ రెడ్డి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్ ప్రారంభించారు. టోర్నమెంటులో మొత్తం 46 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకుని ఆరోగ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి రాణీ రుద్రమా రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ , నాయకులు బొక్క నర్సింహా రెడ్డి , పొరెడ్డి నర్సింహా రెడ్డి, అంజయ్య యాదవ్ పెద్దఅంబర్ పేట పార్టీ అధ్యక్షులు బాల మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.

గిగ్ కార్మికులు భద్రత కోసం రోడ్డు నియమాలు పాటించాలి : ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

నేరేడ్ మెట్,వినాయక్‌నగర్, జనవరి 21,ప్రభాతవార్త :

టిఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ ఫరీద్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి నియోజకవర్గం వినాయక్‌నగర్‌లో గిగ్ కార్మికుల సంరక్షణ లక్ష్యంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి మల్కాజ్‌గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గిగ్ కార్మికులు రోడ్లపై పనిచేస్తూ ప్రతిరోజూ ప్రమాదాలకు గురవుతున్నారని, వారి ప్రాణాల రక్షణే అత్యంత ముఖ్యమని అన్నారు. అందుకే ప్రతి డ్రైవర్, డెలివరీ చేసే యువకుడు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, అతివేగాన్ని నివారించడం, వాహన నడుపుతూ ఫోన్ వాడకపోవడం తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన షేక్ ఫరీద్‌ను ఎమ్మెల్యే అభినందిస్తూ, గిగ్ కార్మికుల కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని చెప్పారు. గిగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, గిగ్ కార్మికులు, స్థానిక ప్రజలు పె